క్లుప్తంగా

నోటు పుస్తకాల వితరణ



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన పాండు రంగ బుక్ డిపో వారు నోట్ పుస్తకాలను ఉచితంగా సరఫరా చేశారు. గురువారం నోటు పుస్తకాలను ప్రధానోపాధ్యాయురాలు శమంత చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థుల అవసరాలకు తగ్గట్లుగా నోట్ పుస్తకాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. టీపీస్యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మడి ఫౌండేషన్‌ను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



రుద్రూర్: కోటగిరి మండలంలోని గుమ్మడి ఫౌండేషన్‌ను గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి పి.పద్మావతి సందర్శించారు. పిల్లలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. చదువులో వారి ప్రగతి పరిశీలించారు. బాగా చదవాలని సూచించారు. ఫౌండేషన్ నిర్వాహకులు గుమ్మడి శ్రీధర్, గుమ్మడి సుచిత్ర, మేనేజర్ మధు తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



రెంజల్(బోధన్): అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను గురువారం ఎంపీడీవో శ్రీనివాస్ పంచాయతీ రాజ్ ఏఈ వినయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. వీరన్నగుట్ట, బోర్గాం, సాటాపూర్ గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి పనుల ప్రగతిని ఆదర్శ పాఠశాలల కమిటీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కనీసం ప్రాధాన్యత ఉన్న పనులను పూర్తి చేయించాలని సూచించారు.

'బండి'ని కలిసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



బోధన్‌టౌన్(బోధన్): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ఢిల్లీలోని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి అడ్లూరి శ్రీనివాస్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అడ్లూరి శ్రీనివాస్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సన్మానించారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పొద్దని ఏఎస్సై రమేష్ తెలిపారు. మండలకేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో గురువారం డ్వాక్రా సంఘాల మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల్లో నుంచి డబ్బులు కాజేస్తున్నారని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామా ల్లో అనుమానాస్పదంగా ఎవరైనా తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

హెచ్‌సీయూ వీసీ దిష్టిబొమ్మ దహనం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూలో వీసీ గెస్ట్‌హౌజ్ ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలియజేయగా ఐదుగురు విద్యార్థి నాయకులను క్యాంపస్ నుంచి సస్పెండ్ చేస్తూ వర్సిటీ యాజమాన్యం నిర్ణయించడం సిగ్గు చేటన్నారు. వెంటనే ఐదురుగు విద్యార్థి నాయకులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు దినేష్, చిత్రు, అరవింద్, కృష్ణ పాల్గొన్నారు.

అసంపూర్తిగా కేజీబీవీ భవనం

- నత్తనడకన సాగుతున్న నిర్మాణ పనులు
- ప్రస్తుత విద్యా సంవత్సరం కూడా విద్యార్థులకు తప్పని తిప్పలు



ముప్కాల్ మండలంలోని కేజీబీవీ భవనం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ) భవన నిర్మాణ పనులు అసంపూర్తిగానే మిగిలాయి. దీంతో విద్యా సంవత్సరం ప్రారంభమైనా విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి అయినా పాఠశాల భవనం సిద్ధమవుతుందని విద్యార్థులు ఆశించారు. కానీ విద్యార్థులకు నిరాశే మిగిలింది. కేజీబీవీ భవన నిర్మాణం కోసం 2021లో రూ.3.5 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి నుంచి పనులు ఆగుతూ.. సాగుతూ వస్తున్నాయి. ఇప్పటి వరకు భవన నిర్మాణ పనులు పూర్తి కాలేదు. గోడలకు సిమెంట్ ప్లాస్టరింగ్ పనులను చేపట్టారు. కాని మిగతా పనులను మరిచారు. పాఠశాల భవన నిర్మాణ పనులు నత్త నడ్వేలా సాగుతున్నాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారభమై 20 రోజులు కావస్తున్నా ఇప్పటికి పనులు ప్రారంభమే కాలేదు అంటే విద్యార్థులపై ఎంత శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవచ్చు. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి ఇప్పటికైనా వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకు రావాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు. వర్షాలు కురిస్తే భవనం వరకు వెళ్లే రోడ్డు కూడా బురదమయంగా మారుతుంది. అంతే కాకుండా సామాను తీసుకుపోవడానికి కూడా తిప్పలు తప్పవు. కరెంట్, ప్లంబింగ్, కింద బండరాయి పనులు వెంటనే పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాల

నూతన మండలాల ఏర్పాటులో భాగంగా 2018లో ముప్కాల్ మండల కేంద్రంగా ఏర్పడింది. ఆ తరువాత విద్యా సంవత్సరం నుంచి కేజీబీవీ పాఠశాలను మండల కేంద్రంలో ప్రారంభించారు. అప్పటి నుంచి అద్దె భవనంలో కొనసాగుతుంది. కేజీబీవీ పాఠశాలలో 5వ తరగతి నుంచి 10 తరగతి వరకు 230 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు వసతి కూడా పాఠశాల వద్దనే కావడం వల్ల ఎక్కువగా గదుల అవసరం ఉంటుంది. కానీ అద్దె భవనంలో కొనసాగడం వల్ల విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. వారికి సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థినులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, వెంటనే పూర్తి చేయించాల్సి అవసరం ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పాఠశాల భవనం పూర్తి కావాల్సిన ఆవశ్యకతను గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతంలో రాష్ట్ర పరిశీలకులు కూడా వచ్చి పరిశీలించారు. అద్దె భవనంలో ఇబ్బందులు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు పాఠశాలను వదిలి వెళ్తున్నారు. భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

– వినోద, స్పెషల్ ఆఫీసర్, కేజీబీవీ, ముప్కాల్

వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): నిజాం చక్కెర కర్మాగారంలో పనిచేసిన కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఫ్యాక్టరీ గేటు ఎదుట సమావేశం నిర్వహించారు. నిజాం చక్కెర కర్మాగారాన్ని రీఓపెన్ చేసి ఫ్యాక్టరీకి పునఃర్ వైభవం తీసుకురావాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీ ప్రకారం కమిటీ వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం త్వరగా ఫ్యాక్టరీని తెరిపించాలని కోరారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తమ బాధలు చెప్పుకుంటామన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు ఉపేందర్, రవిశంకర్ గౌడ్, బాలకృష్ణ, శ్రీనివాస్, రాంబాబులు ఉన్నారు.

ప్రయాణికుల క్షేమమే ఆర్టీసీ ధ్యేయం

- ఎంవీఐ శ్రీనివాస్



ఉత్తమ డ్రైవర్‌ను సన్మానిస్తున్న ఎంవీఐ

బోధన్‌టౌన్(బోధన్): ప్రయాణికులను క్షేమంగా వారి గమ్య స్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ఉద్యోగుల ధ్యేయమని ఎంవీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం బోధన్ ఆర్టీసీ డిపోలో ప్రగతి చక్రం అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంవీఐ హాజరై మాట్లాడారు. ముందుగా విధుల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన డ్రైవర్, కండక్టర్‌లను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. లక్ష్యే లక్ష్యం ఛాలెంజ్‌లో భాగంగా విద్యార్థులకు ఎస్సె రైటింగ్ కాంపిటీషన్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డ్రైవర్‌తో పాటు కండక్టర్లు ప్రయాణికులను గౌరవించాలని సూచించారు. బస్సును నడిపే డ్రైవర్లు చికాకుతో డ్రైవింగ్ చేయరాదని, మద్యం కూడా సేవించరాదన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

పోతంగల్‌లో తైబజార్ వేలంపాట

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో గురువారం తైబజార్ వేలం పాట నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి మారుతి అధ్యక్షతన జరిగిన వేలం పాటలో వారంతపు సంతను రూ.2 లక్షల 5 వేలకు గంగరాజు, మేకల సంత రూ. లక్షా 80 వేలకు భూమయ్య, రోజువారీ సంత రూ.61 వేలకు సాగర్, మస్లక్ రూ.5,220లకు ఇబ్రహీం దక్కించుకున్నారు. జీపీ కార్యదర్శి చంద్రకాంత్, కారోబారీ నగేష్ పాల్గొన్నారు.

బోధన్‌లోని జిల్లా ఆస్పత్రిలో పాత వస్తువుల బహిరంగ వేలం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గల పాత ఐరన్, పనికి రాని ప్లాస్టిక్ వస్తువుల బహిరంగ వేలం ఈ నెల 4న వేయాలని నిర్ణయించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాహుల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన చేశారు. ఈ వేలంలో పాల్గొనే కాంట్రాక్టర్లు, ఇతరులు జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో రూ.2 వేలు, ఆస్పత్రి డెవలప్‌మెంట్ సొసైటీ బోధన్ పేరిట డీడీ తీసుకొని జులై 1 నుంచి 3 వరకు కార్యాలయ పని వేళల్లో దరఖాస్తు పొందాలన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.20 వేల ఈఎండీ చెల్లించి ఆస్పత్రి డెవలప్‌మెంట్ సొసైటీ, బోధన్ పేరిట డీడీ తీయాలని సూచించారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు గోపికృష్ణ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహనీయుల చారిత్రాత్మక పుస్తకాలు, డిక్షనరీలు, ఆధ్యాత్మిక పుస్తకాలు లైబ్రరీకి, అదేవిధంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్యూట్ బ్యాగ్‌లను అందజేసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత స్థాయిలో నిలవడానికి విద్య, క్రమశిక్షణ, దేశం పట్ల గౌరవం, సేవా భావం విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. ప్రాజెక్ట్ స్పాన్సర్‌గా వ్యవహరించిన పట్వారి తులసికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి లక్ష్మీనారాయణ, పుష్పకర్ రావు, ప్రవీణ్ పవార్, దామోదర్, ఆనంద్, హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఓవైసీ దిష్టిబొమ్మ దహనం



ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్ మాట్లాడుతూ.. పార్లమెంటులో పాలస్తీనాకు జై అని చెప్పిన ఎంఐఎం అధ్యక్షుడు ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని పార్లమెంటు సభ్యుడిగా తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రమాణ స్వీకారం చేసే సమయంలో పరాయి దేశానికి జై అన్న ఓవైసీ భారతదేశ సార్వభౌమ్యత్వాన్ని కించపరచడమేనని అన్నారు. ఓవైసీపై దేశద్రోహం కేసు నమోదు చేసి పార్లమెంట్ సభ్యుడిగా అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ద్యాగ ఉదయ్, యామాద్రి భాస్కర్, ఆకుల శ్రీను, కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, పులి యుగంధర్, విజయ ఆనంద్, ఉదయ్ గౌడ్, సాయినాథ్ రెడ్డి మధు తదితరులు పాల్గొన్నారు.

మోతె వీడీసీపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న దళిత నేతలు

కమ్మర్‌పల్లి: వేల్పూర్ మండలం మోతె గ్రామాభివృద్ధి కమిటీపై చర్యలు తీసుకోవాలని కమ్మర్‌పల్లి మండల దళిత సంఘాల సభ్యులు గురువారం తహసీల్దార్ ఆంజనేయులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కండె కాంత్రి మాట్లాడుతూ.. మోతె గ్రామంలో మాదిగ కులానికి చెందిన ఓ కుటుంబం భూమి విషయంలో వీడీసీ అతిగా ప్రవర్తించిందన్నారు. ఆ భూమిని కబ్జా చేయడమే కాక, కుటుంబ సభ్యులను బహిష్కరించారని ఆరోపించారు. భూమిలో సాగు చేస్తున్న పంటను ధ్వంసం చేయడమే కాక, చుట్టూ ఉన్న కంచెను తొలగించారన్నారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పిస్తూ, వీడీసీపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కనగర్తి అశోక్, ఎర్ర రాజు, ఎం గంటి పృథ్వీ, మేకల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రాధాన్యం



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తోన్న నేతలు

బోధన్‌టౌన్(బోధన్): రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, అందులో భాగంగానే ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని డీసీసీబీ డెలిగేట్ గంగా శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ డెలిగేట్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేసి ఆదుకుంటామని ఎన్నికల ముందు వరంగల్ సభలో రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని.. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం రుణమాఫీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పాషా మోయినొద్దిన్, కౌన్సిలర్‌లు శరత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్‌చారీ, నాయకులు దాము, చిరంజీవి, ఖలీం, ప్రమోద్, హన్మంత్‌రావ్, ఖలీం, తదితరులున్నారు.

ఓపెన్ టెన్త్ స్టడీ సెంటర్ ఎత్తివేత?



కమ్మర్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దశాబ్ద కాలంగా కొనసాగుతున్న ఓపెన్ స్కూల్ టెన్త్ అండ్ ఇంటర్ స్టడీ సెంటర్‌ను సంబంధిత జిల్లా ఉన్నత అధికారులు ఎత్తివేసినట్లు తెలిసింది. 14 ఏళ్లుగా అప్రతిహాతంగా సేవలందించిన ఈ స్టడీ సెంటర్ ఎత్తివేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కమ్మర్‌పల్లి మండల కేంద్రం నేషనల్ హైవేపై ఉండడంతో గ్రామీణ ప్రాంత వయోజనులకు సౌలభ్యంగా ఉండేది. ఇప్పటి వరకు విద్యార్హతలు లేని వందల మందికి పదో తరగతి విద్యార్హత అందించి ప్రయోజకులుగా మార్చిన స్టడీ సెంటర్ ఇకపై కొనసాగే అవకాశం లేదు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంతో పాటు మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లోని వయోజనులకు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై హెచ్‌ఎం సాయన్నను సాక్షి సంప్రదించగా, పాఠశాలలో స్టడీ సెంటర్ నిర్వహించడం ఇబ్బంది అవుతుందని, ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సెంటర్ నిర్వహణ బాధ్యతలు తీసుకోవడానికి ఉపాధ్యాయులు ముందుకు రానందున జిల్లా విద్యాశాఖ అధికారికి సెంటర్ ఎత్తివేయాలని లేఖ పంపామన్నారు.

స్టడీ సెంటర్ కోసం ప్రయత్నాలు..

స్టడీ సెంటర్ కోసం మండలంలోని ఆయా హెచ్‌ఎంలు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఎలాగైనా స్టడీ సెంటర్ దక్కించుకోవాలనే ఉద్దేశంతో యూనియన్ నాయకులతో సంప్రదింపులు చేసి పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. సెంటర్ నిర్వహణ విషయమై మండలంలోని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం ఏర్పాటు చేసిన తర్వాతనే స్టడీ సెంటర్ అలాట్‌మెంట్ చేయాలని కొంతమంది ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించండి



వినతి పత్రం అందజేస్తున్న జీవీ నర్సింహారెడ్డి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజును కోరారు. ఈమేరకు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో చెత్త సేకరణకు బీఎస్–4 వాహనాల కొనుగోలుపై, మొరం వేయకున్నా అక్రమంగా మొర్రం బిల్లు రికార్డు చేయడంపై, పంపుసెట్ల రిపేర్ పేరు మీద జరిగిన అక్రమాలపై, అక్రమంగా ఇచ్చిన ఇంటి నెంబర్లపై విచారణ జరపాలన్నారు. ఈ నెల 6న జిల్లా కలెక్టర్‌కు ఆర్మూర్ మున్సిపల్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్మూర్‌లో మున్సిపల్‌లో అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని ఆదేశాలు వచ్చినప్పటికి ఇప్పటి వరకు ఎటువంటి చలనం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలన్నారు. బీజేపీ నాయకులు ద్యాగ ఉదయ్, ఆకుల శీను, కలిగోట ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

'గురుకుల'లో దరఖాస్తులకు ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ దుర్గారెడ్డి గురువారం తెలిపారు. తల్లిదండ్రులు ఈ నెల 27 నుంచి వచ్చే నెల 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే పాఠశాలల బదిలీ కోరుకునే వారు ఈ నెల 27 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డిగ్రీ ప్రవేశాల కోసం..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ధనవేణి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పాసైన విద్యార్థినులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఇంటర్ టీసీ, మెమో, ఎస్ఎస్‌సీ మెమో, బోనోఫైడ్, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని కళాశాలకు రావాలన్నారు.

తై బజార్ వేలం వాయిదా

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట్ గ్రామానికి సంబంధించి వారసంతతో పాటు రోజువారీ సంత వేలం వాయిదా పడింది. 2024 – 25 సంవత్సరానికి సంబంధించిన వేలం పాటను గురువారం జీపీ కార్యాలయంలో నిర్వహించగా సరైన కోరం రానందున వాయిదా వేసినట్లు ఎంపీవో కిరణ్ కుమార్ తెలిపారు. తదుపరి వేలంపాటను శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ వేలము పాటలో పాల్గొనదల్చిన వారు తైబజార్(వారసంత)నకు రూ.50 వేలు, రోజువారీ సంతకు రూ.30 వేల డిపాజిట్ రూపేనా ఉదయము 10 లోపు చెల్లించాలన్నారు. గతంలో బకాయిలు ఉన్నవారు వేలం పాటలో పాల్గొనటానికి అనర్హులని పేర్కొన్నారు.

కమ్మర్‌పల్లి తైబజార్..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో గురువారం నిర్వహించిన తైబజార్ వేలం పాట వాయిదా పడింది. వేలం పాట టార్గెట్ గత సంవత్సరం కంటే తక్కువగా రావడంతో వేలం వాయిదా వేసినట్లు జీపీ కార్యదర్శి శాంతికుమార్ తెలిపారు. శుక్రవారం మళ్లీ వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు.

రేపు రుద్రూర్ మండల సర్వసభ్య సమావేశం

రుద్రూర్: రుద్రూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్ బాబు తెలిపారు. ఎంపీపీ సుజాత అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వివిధ శాఖ అధికారులు ప్రగతి నివేదికలు సమర్పించాలని, మండల పరిషత్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న హెచ్‌ఈవో గోవర్ధన్



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రుద్రూర్: విద్యార్థులు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని కోటగిరి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆయన సందర్శించారు. తాగు నీరు ట్యాంకు, పాఠశాల పరిసరాలు పరిశీలించారు. నీటి ట్యాంకుపైన తప్పనిసరిగా మూత ఉంచాలని, వారానికి ఒకసారి ట్యాంకు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వర్షాకాలం ఈగలు, దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెల్త్ సూపర్ వైజర్ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్స్ రోజా, శ్రీదేవి, ఆశా కార్యకర్తలు అనిత, సంగీత, అక్తరీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



ఆర్మూర్‌టౌన్: నందిపేట గ్రామ శివారులో సర్వే నెంబర్–630/1లో ఎకరం 20 గుంటల భూమిని వెనుకబడిన పేదలకు ప్రొసీడింగ్ ద్వారా ఇచ్చారని, కాని కొందరు పేదల స్థలాల కబ్జాకు ప్రయత్నం చేస్తున్నారని, అలా జరగకుండా బాధితులకు న్యాయం చేయాలని ఆలిండియా అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మూగ ప్రభాకర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో మాట్లాడుతూ.. ఉన్నతా అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఒకవేళ అధికారులు స్పందించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని రాష్ట్ర వ్యాప్త సమస్యగా మారుస్తామని హెచ్చరించారు. బాధితులు తన్నీరు గంగామణి, సురేఖ, ధనలక్ష్మి, వాణి, వెంకటేష్, లలిత, లక్ష్మి, నఫీస్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	కల్కి ఏడి-2898 (తెలుగు) - 9.30, 4.15, 11.00 మహారాజ (తెలుగు) - 1.15, 8.00
స్క్రీన్-2 –	కల్కి ఏడి-2898 (తెలుగు) - 8.00, 11.45, 3.30, 7.15, 11.00
స్క్రీన్-3 –	కల్కి ఏడి-2898 (తెలుగు) - 10.05, 1.50, 5.35, 9.20
స్క్రీన్-4 –	కల్కి-2898 (తెలుగు) - 11.05, 2.50, 6.35, 10.20